సాక్షి ఒడిశా

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,89,996
బంగారం 320 మిల్లీ గ్రాములు
వెండి 44 గ్రాముల 150 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



భారీగా గంజాయి స్వాధీనం

రాష్ట్రంలోని వేర్వేరు చోట్ల భారీగా గంజాయి పట్టుబడింది.

- 8లో.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	గురు	శుక్ర
	6.07	4.22

న్యూస్‌రీల్

బీజేపీకి భృగుభక్షిపాత్రో రాజీనామా



భృగుభక్షి పాత్రో



భృగు భక్షిపాత్రో రాజీనామా

పర్లాకిమిడి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భృగు భక్షి పాత్రో తన ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేసి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌కు పంపించారు. గత 23 ఏళ్లుగా పార్టీలో అత్యంత క్రియాశీలకంగా పనిచేసినా, పార్టీ తనను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో బరంపురం లోక్‌సభ స్థానం నుంచి భృగుభక్షి పాత్రో కమలం గుర్తుతో పోటీచేసి బీజేడీ అభ్యర్థి (బరంపురం) చంద్రశేఖర సాహు చేతిలో ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పార్టీలో చేరిన ప్రదీప్ పాణిగ్రాహికి బరంపురం లోక్‌సభ టిక్కెట్టు ఖరారవ్వడంతో తీవ్ర నిరాశకు గురై భృగు భక్షి పాత్రో రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. ఆయన త్వరలో బీజేడీ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

8 స్థానాల్లో సీపీఐ పోటీ

- సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాలు కలిపి మొత్తం 8 స్థానాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) పోటీ చేయనుందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలియజేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఐఎన్‌డీఐఏ కూటమి మిత్రపక్షాలతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తమ ప్రధాన ప్రత్యర్థి బీజేపీ అని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యమన్నారు. ప్రతిపక్ష పార్టీలను అవినీతి గూండాలుగా ప్రధాని నరేంద్రమోదీ అభివర్ణించారు కానీ మోదీ మాత్రం అవినీతి కొండపై కూర్చున్నారని మండిపడ్డారు. బీజేపీకి విరాళాలు ఇవ్వని వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ తదితర బలప్రయోగాలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు ఒక్కటవుతుండడంతో మోదీ భయాందోళనకు గురవుతున్నారన్నారు. పార్లమెంటులో ఎన్డీయే 400 కంటే అధికంగా స్థానాలు అనే నినాదం గురి తప్పిన బాణమవుతుందని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీజేడీలను ఓడించాలని పిలుపునిచ్చారు.

బీజేడీలోకి సునీత




సునీతను బీజేడీలోకి ఆహ్వానిస్తున్న కౌసల్య ప్రధాని

కొరాపుట్: నబరంగ్‌పూర్ పట్టణ బీజేపీ అధ్యక్షురాలు సునీతా షావుకారు బీజేడీ పార్టీలో బుధవారం చేరారు. బైపాస్ రోడ్డులో సిట్టింగ్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. పట్టణ బీజేపీ విభాగంలో చురుగ్గా పాల్గొనే సునీత గత కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే శిబిరంలో పాల్గొని చర్చలకు తావిచ్చారు. తదనంతర పరిణామాల్లో ఎమ్మెల్యే సతీమణి కౌసల్య ప్రధానికి బీజేడీ టిక్కెట్ కేటాయించింది. సునీత వెళ్లి ఆమెకి శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా బుధవారం బీజేడీలో చేరారు. నబరంగ్‌పూర్ అసెంబ్లీ బీజేడీ అభ్యర్థి కౌసల్య ప్రధాని బీజేడీ కండువా వేసి సునీతకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రమోద్, దిల్లు పండా తదితరులు పాల్గొన్నారు.

సీఎం నవీన్‌కు సవాల్..!

- రసవత్తరంగా హింజిలికాటు ఎన్నిక
- సీఎంకు పోటీగా బీజేపీ అభ్యర్థి శిశిర్ మిశ్రా
- స్థానికత పేరుతో ప్రచారం





భువనేశ్వర్: గంజాం జిల్లా హింజిలికాటు నియోజకవర్గం ఎన్నిక ఈసారి రసవత్తరంగా ఉంటుంది. ఈ నియోజకవర్గం నుంచి బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో ముఖాముఖి తలపడేందుకు భారతీయ జనతా పార్టీ సరికొత్త ముఖాన్ని రంగంలోకి దింపింది. వరుసగా 6వసారి తిరిగి ఎన్నికవ్వాలని ఉరకలేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఓడించేందుకు బీజేపీ విడుదల చేసిన తొలి జాబితాలో కొత్త ముఖం శిశిర్ మిశ్రాని అభ్యర్థిగా ప్రకటించింది. ఈయన దివంగత శరత్ మిశ్రా తమ్ముడు. గంజాంలో కాషాయ పార్టీ పునాదిని బలపరిచిన వ్యక్తిగా పేరొందాడు. శిశిర్ మిశ్రా 2019 ఎన్నికల్లో హింజిలీలో బీజేపీ అభ్యర్థి అయిన న్యాయవాది పీతాంబర్ ఆచార్యకు సమన్వయకర్తగా పని చేశాడు.

ప్రదీప్ అనుభవంపై ఆశలు

బరంపురం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ప్రదీప్ పాణిగ్రాహి పోటీ చేస్తున్నాడు. ఇతను అనేక సంవత్సరాలుగా ముఖ్యమంత్రి తరుపున నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించి, హింజిలికాట్‌లో నవీన్ పట్నాయక్ విజయంలో భాగస్వామిగా నిలిచారు. ప్రస్తుతం ప్రదీప్ పాణిగ్రాహి బీజేడీ నుంచి వైదొలగి బీజేపీ అభ్యర్థిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన అనుభవం హింజిలి నుంచి బీజేపీ టిక్కెట్టుతో పోటీ చేస్తున్న శిశిర్ మిశ్రాకు బలమైన గెలుపు వనరుగా దోహదపడుతుందని ఆశిస్తున్నాడు. వ్యూహాత్మకంగా శిశిర్‌ని హింజిలి నుంచి బీజేపీ బరిలోకి దింపి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ధీటైన పోటీనిచ్చేందుకు నడుం బిగించింది. వీరివురి పోరుతో గంజాం జిల్లాలో కీలకమైన నియోజకవర్గంగా పేరొందిన హింజిలి ఎన్నిక రసవత్తరంగా ఉంటుంది.

బీజేపీ బలం పెరిగింది: శిశిర్ మిశ్రా



శిశిర్ మిశ్రా

నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలం పుంజుకుంటుందని శిశిర్ మిశ్రా అన్నారు. ఇటీవల ముగిసిన మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేడీకి గట్టి పోటీ ఇచ్చామని తెలిపారు. తాను స్థానికుడినని తెలియజేశారు. పాఠశాల నుంచి కళాశాల విద్యను ఇక్కడే పూర్తి చేసినట్టు తెలియజేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు జగన్నాథ్ మిశ్రా మనవడినని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నాయకత్వంలో సురక్షితమైన, సుసంపన్నమైన భారతదేశం దార్శనికతను సాకారం చేసేందుకు మోదీ జీ హామీ ఆధారంగా ఓట్లు పొందేందుకు ప్రచారం చేయనున్నట్లు వివరించాడు. హింజిలి నియోజకవర్గంలో క్రమంగా నవీన్ పట్నాయక్ గ్లామర్ మసకబారుతుందని ఆరోపించారు. ఆయన తొలిసారిగా 2000 సంవత్సరంలో పోటీచేసి భారీ ఆధిక్యతతో గెలిపొందారు. ఈ ఆధిక్యత 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారీగా దిగజారిందన్నారు.

ఈసారి గెలిస్తే రికార్డు

2000లో హింజిలి నుంచి 29,826 ఓట్ల తేడాతో గెలిపొందిన నవీన్ పట్నాయక్‌కు, 2014 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆధిక్యత భారీగా 76,586కి పెరిగింది. 2019 ఎన్నికల నాటికి 5 ఏళ్ల తర్వాత 60,160కి పడిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీ అధ్యక్షుడు పశ్చిమ ఒడిశా నియోజకవర్గమైన బీజేపూర్, గంజాం జిల్లా హింజిలి రెండింటి నుంచి పోటీ చేసి గెలిపొందారు. హింజిలీని నిలబెట్టుకుని పశ్చిమ ఒడిశా బీజేపూర్ స్థానం నుంచి వైదొలిగారు. ఇదిలా ఉండగా త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేడీ తిరిగి అధికారంలోకి వస్తే నవీన్ పట్నాయక్ సిక్కింకు చెందిన పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును అధిగమించి దేశంలోనే దీర్ఘకాలిక ముఖ్యమంత్రిగా రికార్డు ఆవిష్కరిస్తారు.

ప్రత్యక్ష పోరులో 'ప్రధాని' కుటుంబం

- నబరంగ్‌పూర్ స్థానంలో పిన్ని, కొడుకు పోటీ



నబరంగ్‌పూర్ బీజేడీ అభ్యర్థి కౌసల్య ప్రధాని



కాంగ్రెస్ అభ్యర్థి దిలీప్ ప్రధాని

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాజకీయాలపై ప్రధాని కుటుంబం ముద్ర చిరస్థాయిలో ఉంటుంది. ఈ కుటుంబానికి చెందిన ఖగపతి ప్రధాని నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరుపున 9సార్లు గెలిపొంది రికార్డు సృష్టించాడు. తర్వాత పోటీ చేయకుండా రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అనంతరం ఖగపతి తమ్ముడు గోపీనాథ్ ప్రధాని నబరంగ్‌పూర్ జిల్లా పరిషత్ ప్రథమ అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే గోపీనాథ్ కుమారుడు సదాశివ ప్రధాని 2019 సార్వత్రిక ఎన్నికల ముందు భారత అల్యూమినియ కేంద్రం(నాల్కో)లో ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. అధికార బీజేడీలో చేరి నబరంగ్‌పూర్ అసెంబ్లీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిపొందారు. అయితే ఖగపతి మనుమడు దిలీప్ ప్రధాని కాంగ్రెస్‌లో కొనసాగుతూ సర్పంచ్ అయ్యారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో సమితి సభ్యుడిగా గెలిపొందారు. దీంతో ఇరు కుటుంబాలు వేర్వేరు పార్టీలను అనుసరించాయి. సమితి చైర్మన్ ఎన్నికల్లో ఇరు కుటుంబాల మధ్య రాజకీయ వైరం పెరిగింది. బాబాయ్ సదాశివతో, అబ్బాయ్ దిలీప్‌లు మాట్లాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. పక్కపక్క ఇళ్లలోనే ఉంటూ దాయాదుల వైరం కొనసాగించారు. కాగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో అధికార బీజేడీ పార్టీ నబరంగ్‌పూర్ అసెంబ్లీ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని సతీమణి కౌసల్య ప్రధానిని బరిలో దించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ దిలీప్ ప్రధానికి ఇదే స్థానంలో టిక్కెట్ కేటాయించింది. దీంతో దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న ప్రధాని కుటుంబంలో సభ్యులు తొలిసారి వైరి పక్షాలుగా తలపడనున్నారు.

బరిలో తండ్రీకూతుళ్లు

- కాంగ్రెస్ నుంచి ఇరువురూ పోటీ



భుజబుల్ మజ్జి, లిఫికా మజ్జి

కొరాపుట్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తండ్రీ, కూతురు ఒకే పార్టీ తరుపున బరిలో దిగనున్నారు. నబరంగ్‌పూర్ లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరుపున భుజబల్ మజ్జి, ఆ పార్లమెంట్ స్థానం పరిధిలోని డాబుగాం అసెంబ్లీ స్థానంలో ఆయన కుమార్తె డాక్టర్ లిఫికా మజ్జిలు పోటీ చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నటువంటి భుజబల్ 2000 సంవత్సరంలో కాంగ్రెస్ టిక్కెట్‌పై డాబుగాంలో పోటీచేసి గెలిచారు. అనంతరం 2004లో అదే స్థానంలో భుజబల్ ఓడిపోయారు. మరలా 2009లో గెలిపొంది, 2014, 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. రెండేళ్ల క్రితం జరిగిన మూడంచెల పంచాయతీ ఎన్నికల్లో డాక్టర్ చదువు పూర్తి చేసిన తన కుమార్తె లిఫికాను పోటీకి నిలిపారు. కాంగ్రెస్ పార్టీ తరుపున జిల్లావ్యాప్తంగా ఒక్క లిఫికా మాత్రమే గెలిపొందారు. ఈ ఏడాది ప్రారంభంలో భుజబల్ నబరంగ్‌పూర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా నియమితులయ్యారు. తండ్రీ కూతుళ్ల గెలుపుపై కాంగ్రెస్ పార్టీ ఆశలు పెట్టుకుంది.

మగుణి చరణ్ కుంవార్‌కు అస్వస్థత



చికిత్స పొందుతున్న మగుణి చరణ్ కుంవార్

భువనేశ్వర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత మగుణి చరణ్ కుంవార్ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. తోలుబొమ్మలాటకారుడైన మగుణి చరణ్ గతేడాది భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర సంప్రదాయ తోలుబొమ్మల ఆటని ప్రోత్సహించడం, ప్రచారం చేయడం కోసం అత్యున్నత పౌర పురస్కారం పొందిన మగుణి చరణ్ అస్వస్థతకు గురైన తర్వాత కెంజొహర్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బలహీనంగా ఉంటుందని కుటుంబీకులకు తెలియజేయడంతో వైద్యులకు సంప్రదించారు. నిలబడి, కూర్చోలేనంతగా ఆయన ఆరోగ్యం బలహీనపడిందని తెలిపారు. సత్వర చికిత్స కోసం అతన్ని జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఇటీవల పెద్ద కుమారుడు మృతి

మగుణి చరణ్ పెద్ద కొడుకు ఇటీవల మృతి చెందాడు. అతని చిన్న కుమారుడు కొన్నేళ్ల క్రితం మరణించాడు. కొడుకులిద్దరినీ పోగొట్టుకుని ఒంటరి జీవితం గడుపుతున్నాడని కోడలు చెప్పింది. 1937లో కెంజొహర్‌లో జన్మించిన మగుణి చరణ్ కుంవార్ సంప్రదాయ తోలుబొమ్మల ఆట కుటుంబానికి చెందినవాడు. ఈ సంప్రదాయాన్ని కొండెయ్ నాచొ (బొమ్మలాట)గా వర్థమాన సమాజానికి పరిచయం చేసి విస్తృత ప్రచారం, వ్యాప్తికి నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ కళని అతని తండ్రి బైష్ణబ్ చరణ్ కుంవార్ నుంచి అభ్యసించారు. మగుణి చరణ్ కృషిని దేశ, విదేశాలు లఘు చిత్రాలుగా చిత్రీకరించి ప్రసారం చేశాయి. ఈ రంగంలో ఆయన పలు గౌరవప్రదమైన సత్కారాలు పొందారు. ఒడిశా సంప్రదాయ తోలుబొమ్మలాటకు చేసిన కృషికి గానూ మగుణి చరణ్ కుంవార్ సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్నారు.

భారీ మావో డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డంప్ సామగ్రితో జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మెలిల్బుంగ్ గ్రామ అడవిలో బుధవారం తెల్లవారు జామున భారీ మావో డంప్‌ను డీవీఎఫ్ జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ప్రాంతం ఆంధ్ర–ఒడిశాకు సరిహద్దున ఉంది. ఈ అడవిలో మావోల కదలికలు ఉన్నట్లు జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీకి సమాచారం వచ్చింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు కలిమెల డీవీఎఫ్, బీఎస్ఎఫ్ జవాన్లు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా మావో డంప్‌ను గుర్తించి వెలికితీశారు. అందులో 190 జిలిటెన్ స్టిక్స్, 20 కిలోల ఐడీ బాంబ్, 5 ఏడు కిలోల ఐడీ బాంబులు, 4 కిలోల బాంబు, 2 కిలోల ఐడీ బాంబు, 5 కిలోల ఐడీ బాంబు, 3 కిలోల ఐడీ బాంబులు మూడుతో పాటు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వాటిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలించారు.

సాంప్రదాయాల పరిరక్షణ అందరి కర్తవ్యం

- ఉగాది ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి



పోటీలను ప్రారంభిస్తున్న చంద్రమౌళి కుముందాన్

రాయగడ: తెలుగు సాంప్రదాయాల పరిరక్షణ అందరి కర్తవ్యమని, ఉగాది ఉత్సవాలను సమైక్యంగా నిర్వహించుకోవాలని జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి కుముందాన్ అన్నారు. స్థానిక తేజస్వీ హోటల్ మైదానంలో ఉగాది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించే వివిధ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ వైభవంగా నిర్వహిస్తోందన్నారు. వరుసగా 12వ ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

ముగ్గుల పోటీకి స్పందన

ఉత్సవాల్లో భాగంగా తేజస్వీ మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళలు ఉత్సాహంగా హాజరయ్యారు. వంద మందికి పైగా పాల్గొన్న ఈ పోటీల్లో నిర్వాహకులు ఉచితంగా రంగులు పంపిణీ చేశారు. సుమారు 45 నిమిషాల వ్యవధిలో మహిళలు రంగవల్లులు పూర్తి చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా పద్మాలయ మిశ్రా, మాలతీ చోదరిలు వ్యవహరించారు. పోటీల్లో ప్రథమ బహుమతిని ఎస్‌కే చాందిని, ద్వితీయ బహుమతి సుజిత్‌ఖోసల, తృతీయ బహుమతి పి.వర్షితలు గెలిపొందారు. అదేవిధంగా ఎస్.ప్రియ, జె.గంగ, కె.శృతిలు ప్రోత్సాహక బహుమతులు దక్కించుకున్నారు.

వేదాలు, శ్లోకాల పోటీలు

అంతకుముందు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల మధ్య నిర్వహించిన వేదాలు, శ్లోకాలు పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఎం.తనూష్ ప్రథమ బహుమతి, బి.సురీతా సబత్ ద్వితీయ బహుమతి, జె.త్రిష తృతీయ బహుమతి సాధించారు. పోటీలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు కాళి, కల్యాణి, గీతాంజలిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులను అందజేయగా, గెలిపొందినవారికి ఈనెల 9, 10వ తేదీల్లో బహుమతులను అందజేస్తారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



విజేతలతో న్యాయ నిర్ణేతలు



వేదాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగడలో కొనసాగుతున్న రభస

- రాజధానికి అసంతృప్త బీజేడీ నాయకులు



రాజధానిలో నెక్కంటి పక్కనే కృష్ణ మహాపాత్రో తదితరులు

రాయగడ: అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ తరుపున పోటీ చేసేందుకు అధిష్టానం ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయించడంపై రభస కొనసాగుతోంది. అనసూయాకు పార్టీ టిక్కెట్టు కేటాయించడంపై వ్యతిరేకిస్తున్న నాయకులు మరోసారి అధిష్టానం పిలుపుమేరకు రాజధాని వెళ్లారు. ఈ మేరకు బుధవారం అసంతృప్తి నాయకులతో అధిష్టానం భేటీ అయ్యింది. ఇరువర్గాల మధ్య వాడీవేడిగా చర్చలు జరిగినట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా రాజకీయ విభేదాల కారణంతో బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరావుతో దూరంగా ఉన్న కాసీపూర్‌కు చెందిన బీజేడీ సీనియర్ నాయకుడు కృష్ణ మహాపాత్రో ఎట్టకేలకు నెక్కంటితో చేయి కలిపారు. అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయించే విషయమై మహాపాత్రో కూడా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఈ ఇద్దరు నాయకులు రాజధాని వెళ్లి అధిష్టానం ముందు తమ గళం విప్పారు. ఎటువంటి ప్రజాధారణ లేని అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయిస్తే ఈసారి కూడా ఈ స్థానం కోల్పోవడం ఖాయమని, అందువల్ల అధిష్టానం మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు సమాచారం.

అధిష్టానం అయోమయం

పార్టీ భవిష్యత్ దృష్ట్యా అనసూయా మాఝి టిక్కెట్టు విషయమై అధిష్టానం అయోమయంలో ఉన్నట్లు తెలుస్తోంది. సరైన నిర్ణయం తీసుకోకపోతే జిల్లాలోని రాయగడ శాసనసభ నియోజకవర్గంతో పాటు ఇటు గుణుపూర్, బిసంకటక్ అసెంబ్లీ స్థానాలు, కొరాపుట్ లోక్‌సభ స్థానాన్ని కూడా కోల్పోయే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో సీనియర్ నాయకుడిగా, రాజకీయ చాణక్యునిగా గుర్తింపు పొందిన నెక్కంటి మాట కాదని అనసూయాకు టిక్కెట్టు విషయంలో అధిష్టానం సరైన నిర్ణయం తీసుకోకపోతే ఆయా జిల్లాలతో సత్సంబధాలు గల నాయకుల నుంచి వ్యతిరేక జ్వాలలు భగ్గుమనడం ఖాయం. దీంతో సునాయసంగా ఉండే ఈ స్థానాల్లో బీజేడీ గెలుపు కష్టతరమవుతుందనడంలో ఎటువంటి అతిసయోక్తి లేదని పరిశీలకులు అంటున్నారు. ఏదిఏమైనప్పటికీ గత 52 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో బీజేడీకి సేవలందించిన నెక్కంటి మాటకు ప్రాధాన్యత ఇస్తారా లేదా అనేది వేచి చూడాల్సిందే.

రేసులో పలువురు

ఇదిలాఉండగా ఒకవేళ అనసూయా మాఝి విషయంలో అధిష్టానం పునరాలోచన చేసినట్లయితే రాయగడ నుంచి పోటీ చేసేందుకు ఇప్పటికే మాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక, అదేవిధంగా కాసీపూర్ ప్రాంతానికి చెందిన బిభీషణ్ మాఝిలు రేసులో ఉన్నారు. వీరిద్దరిలో ఎవ్వరికి టిక్కెట్టు దక్కినా నెక్కంటి, కృష్ణ మహాపాత్రోలు వారి గెలుపు కోసం కృషి చేయనున్నారు. అయితే అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే విషయం ఆసక్తికరంగా మారింది.

క్లుప్తంగా

'దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు'


చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుపడిన చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తగులుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి, ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకులు చింతాడ రవికుమార్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటికే వెళ్లి పింఛన్లు అందించారని, ఇప్పుడు సచివాలయాలకు వెళ్లాలని చెప్పడంతో దూర ప్రాంతాల్లో ఉండే వారు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఈ మార్పులను గమనించాలని, ఎవరి వల్ల ఇలా జరిగిందో తెలుసుకోవాలని కోరారు.

సాయిబాబా పెరల్స్ నూతన బ్రాంచి ప్రారంభం


సాయిబాబా పెరల్స్ నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో గడిచిన 30 ఏళ్లుగా బంగారం వ్యాపారంలో గుర్తింపు పొంది కస్టమర్స్ నమ్మకాన్ని పొందుతున్న సాయిబాబా పెరల్స్ నూతన బ్రాంచి బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన నూతన బ్రాంచిని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసన్నపేటలో సాయిబాబా పెరల్స్ అధికంగా కస్టమర్స్ నమ్మకాన్ని నిలబెట్టుకున్న సంస్థ అని అన్నారు. ఇలాంటి షాపుల వల్ల నరసన్నపేటకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. సాయిబాబా పెరల్స్ సంస్థ ప్రతినిధులు నానాజీ బ్రదర్స్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో పాటు పలువురు పాల్గొని నానాజీ బ్రదర్స్‌ను అభినందించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస పంచాయతీ పరిధి సన్యాసిపేట గ్రామానికి చెందిన సింగువలస అప్పలమ్మ(30)అనే వివాహిత బుధవారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. టెక్కలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతురాలు అప్పలమ్మ తన భర్త సింహాచలం వేధింపులు కారణంగా గత నెల 28వ తేదీన ఇంటిలో ఎవరు లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఇది గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి జన్ని ఎండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కృష్ణాపార్కు సమీపంలో ద్విచక్రవాహనాలు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ వి.సందీప్‌కుమార్ చెప్పి న వివరాల మేరకు.. పెద్దపాడు రోడ్డులో జీవన్ జ్యోతి నగర్‌లో నివసిస్తున్న ఎస్.సురేష్ కృష్ణాపార్కు సమీపంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో లోన్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధుల నిమిత్తం ఈనెల 2న రామకృష్ణా థియేటర్‌సందు నుంచి తన ద్విచక్రవాహనంపై కృష్ణాపార్కు చేరుకునేసరికి డేఅండ్‌నైట్ కూడలి నుంచి ఏడురోడ్ల కూడలి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న రూరల్ మండలం అలి కాం గ్రామానికి చెందిన కళింకోట ఎర్రంనాయుడు ఢీకొట్టాడు. దీంతో సురేష్‌కు గాయమైంది. వెంటనే ఆయనను ఆటోలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి రిమాండ్

టెక్కలి రూరల్: గత నెల 31వ తేదీన భగవాన్‌పురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తెను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసిన టెక్కలి పోలీ సులు బుధవారం ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విజయగణపతికి అష్టోత్తర శత దీపారాధన



శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాలకొండ రోడ్డులోని విజయగణపతి దేవాలయంలో స్వామికి అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. ఆలయఅర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారి అష్టోత్తర శత దీపారాధనలు జరిగాయి. భక్తులు పాల్గొన్నారు.

బీజేడీ మరో జాబితా విడుదల

- 27 అసెంబ్లీ, 5 లోక్‌సభ స్థానాల ప్రకటన
- పెండింగ్‌లో బాలాసోర్ లోక్‌సభ స్థానం




ధనంజయ్ సిద్ధు

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల రెండో జాబితా, లోకసభ స్థానాలకు మూడో జాబితా బిజూ జనతా దళ్ (బీజేడీ) బుధవారం విడుదల చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు 27 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను, 5 మందితో లోక్‌సభ స్థానాల అభ్యర్థులను బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వీడియో సందేశం ద్వారా ప్రకటించారు. మరో లోక్‌సభ స్థానం బాలాసోర్ అభ్యర్థి ప్రకటించాల్సి ఉంది.

నవీన్ పట్నాయక్ నేతృత్వంలో పలువురు సిట్టింగ్ శాసన సభ్యులను తిరిగి నామినేట్ చేసింది. ఈ క్రమంలో గత విడతలో ఉప ఎన్నికలో విజేతలుగా నిలిచిన ఇద్దరు మహిళలకు ఈసారి టిక్కెట్టు లభించడం విశేషం. వీరిలో రాష్ట్ర మాజీ ఆరోగ్య – కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవ కిషోర్ దాస్ హత్య తర్వాత జరిగిన ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో విజయం సాధించిన దీపాలీ దాస్‌కు అదే స్థానం నుంచి ఈసారి టిక్కెట్టు లభించింది. 2022లో తన భర్త కిషోర్ మహంతి మరణంతో జరిగిన ఉప ఎన్నికలో గెలిచిన బ్రజరాజ్ నగర్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే అలకా మహంతీని అదే అసెంబ్లీ నియోజకవర్గానికి బిజూ జనతా దళ్ అభ్యర్థిగా బరిలోకి దింపింది. బీరమహారాజ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి పద్మనావ్ బెహెరాను తిరిగి నామినేట్ చేసింది. 2009 నుంచి ఆయన ఈ నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేడీలో చేరిన ఖరియార్ ఎమ్మెల్యే అధిరాజ్ పాణిగ్రాహికి తాజా జాబితాలో పట్టం గట్టారు. అదే అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు బీజేడీ టిక్కెట్ దక్కింది. అధికార బిజూ జనతా దళ్ గత నెల 27న 72 అసెంబ్లీ స్థానాలకు, రెండు విడతల్లో 15 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ప్రకటించిన 5 మంది లోక్‌సభ అభ్యర్థుల్లో 4 మంది కొత్త వారే. బర్‌గడ్ నుంచి పరిణీతా మిశ్రా, కెంజొహర్ నుంచి ధనంజయ్ సిద్ధూ, బరంపురం నుంచి భృగు బక్షిపాత్రో, బొలంగీర్ నుంచి సురేంద్ర సింగ్ భోయ్ కొత్త ముఖాలు. భద్రక్ లోక్‌సభ స్థానం నుంచి మంజులత మండల్ మాత్రమే సిట్టింగ్ అభ్యర్థి.

లోక్‌సభ అభ్యర్థులు వీరే...

నియోజకవర్గం	అభ్యర్థి
బొలంగీర్	సురేంద్ర సింగ్ భోయ్
భద్రక్	మంజులత మండల్
బర్‌గడ్	పరిణీతా మిశ్రా
బరంపురం	భృగు బక్షిపాత్రో
కెంజొహర్	ధనంజయ్ సిద్ధు


పరిణీతా మిశ్రా


భృగు భక్షిపాత్రో


సురేంద్ర సింగ్ భోయ్


మంజులత మండల్

అసెంబ్లీ అభ్యర్థులు వీరే...

నియోజకవర్గం	అభ్యర్థి
బ్రజ్‌రాజ్ నగర్	అలకా మహంతి
ఝార్సుగుడ	దీపాలి దాస్
తాలొసారా	బిజయ్ టొప్పో
సుందర్‌గడ్	జోగేష్ సింగ్
రాజ్‌గంగ్‌పూర్	అనిల్ బర్వా
బొణై	భీమ్‌సేన్ చౌదరి
జశీపూర్	చక్రధర్ హేంబ్రం
ఉదొలా	శ్రీనాథ్ సొరేన్
బరిపద	సనంద మరాండి
బొడాసాహి	అనుసయ పాత్రొ
మొరోడా	ప్రీతినంద కనుంగో
సొరో	మాధబ్ ధాడా
అలొమల్లిక్	నళినీకాంత్ ప్రధాన్
బీరమహరాజపూర్	పద్మనావ్ బెహెరా
ఖరియార్	అధిరాజ్ పాణిగ్రాహి
పుల్బాణి	జయశ్రీ కన్హర్
మహంగా	అంకిత్ ప్రతాప్ జెనా
తిర్తోల్	రమాకాంత్ భోయ్
జగత్‌సింగ్‌పూర్	ప్రశాంత్ ముదులి
భువనేశ్వర్ (ఉత్తర)	సుకాంత రౌత్
ఏకామ్ర-భువనేశ్వర్	అశోక్ చంద్ర పండా
ఖల్లికోట్	సూర్యమణి వైద్య
అస్కా	మంజుల స్వంయి
బరంపురం	రమేష్ చౌ పట్నాయక్
పర్లాకిమిడి	రూపేష్ పాణిగ్రాహి
మోహన	అంతర్యామి గొమాంగో
పొట్టంగి	ప్రఫుల్ల పంగి

ఉత్సాహంగా సమ్మర్ కోచింగ్ క్యాంప్






స్థానిక క్రీడా మైదానంలో బరంపురం ఉప జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో సబ్-డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఉత్సాహంగా కొనసాగుతోంది. క్యాంప్‌లో బాస్కెట్ బాల్, వాలీబాల్, రన్నింగ్, కబడ్డీ, ఖో-ఖో తదితర క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ కాజల్ తెలియజేశారు. నగరంలోని 30 పాఠశాలలకు చెందిన సమారు 80 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుం టున్నారు.

– బరంపురం

కాంగ్రెస్‌తోనే ఆదివాసీలకు మేలు


ర్యాలీలో పాల్గొన్న గిరిజన యువత

- మాజీ మంత్రి హోలధర కార్జి


మాట్లాడుతున్న హోలధర కార్జి

పర్లాకిమిడి: కాంగ్రెస్ పార్టీతోనే ఆదివాసీలకు మేలు జరుగుతుందని మాజీమంత్రి హోలధర కార్జి అన్నారు. నగరంలో కాంగ్రెస్ పరివర్తన సమావేశం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక జగన్నాథ మందిరం నుంచి వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే గిరిజనుల హక్కులను కాపాడగలదని పేర్కొన్నారు. ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు వస్తుంటాయి, కానీ ఈసారి ఎన్నికలు మన దేశ, రాష్ట్ర భవిష్యత్తును మార్చేవిధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం, కేంద్రంలో మోదీ ప్రభుత్వం హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. గిరిజనులంతా ఆలోచించి రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, పర్లాకిమిడి కాంగ్రెస్ అభ్యర్థి బిజయ్ పట్నాయక్, గోపాల్‌పూర్ మాజీ ఎమ్మెల్యే త్రినాథ బెహరా, సీనియర్ నాయకులు ఎ.జైమినిరావు, గుమ్మా సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణపాత్రో, గుసాని మాజీ చైర్మన్ విష్ణు, బిభూతీ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి కాంగ్రెస్ శ్రీకారం


ప్రచారంలో పాల్గొన్న సప్తగిర, అప్పలస్వామి తదితరులు


కాంగ్రెస్ శ్రేణుల పాదయాత్ర

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాయగడలో ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ బుధవారం శ్రీకారం చుట్టింది. కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సప్తగిరి శంకర్ ఉలక, ఆయన సతీమణి పూజా ఉలక, రాయగడ నుంచి పోటీ చేస్తున్న అప్పల స్వామి కద్రక, గుణుపూర్ నుంచి పోటీ చేస్తున్న సత్యజిత్ గొమాంగో, అదేవిధంగా బిసంకటక్ శాసనసభ నుంచి పోటీ చేస్తున్న నీలమాధవ హికకలు ఈ ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా కాంగ్రెస్ భవనం నుంచి పాదయాత్రగా ఎస్‌బీఐ కూడలి మీదుగా జగన్నాథ మందిరం వరకు చేరుకుంది. అక్కడ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు జగన్నాథుని దర్శనం చేసుకున్న అనంతరం మజ్జిగౌరి మందిరం వరకు వెళ్లి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

కాంగ్రెస్‌దే అధికారం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక అన్నారు. కాంగ్రెస్ వస్తుందనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని తెలియజేశారు. ఐదేళ్లలో ఎంపీగా ప్రజలకు అందించిన సేవలే తనను గెలిపిస్తాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిన్నారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హుండీలో పలు ఆలయాల్లో చోరీ


వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను పరిశీలిస్తున్న క్లూస్ టీం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం పూండి ఉమాకామేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయాల్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయాల్లో చొరబడి దేవతా మూర్తులకు అలంకరించిన రూ.11 లక్షలు విలువ చేసే దాదాపు 12 తులాల నాగాభరణం, ధారా పాత్ర, రెండు దీపం కుందులు, పంచపాత్ర, మూడు శఠగోపాలు, వెండి నామం, వెండి ప్లేట్, ఉద్ధరిణితో పాటు హుండీలోని రూ.10 వేలు వరకు నగదు అపహరించారు. రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో శివాలయం వెనుక భాగం నుంచి ప్రవేశించిన దుండగులు ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. భోగం గదిలో ఉంచిన సీసీ కెమెరాలు రికార్డింగ్ చేసే డీవీఆర్ పరికరాలను సైతం తమ వెంట పట్టుకుపోయారు. బుధవారం ఉదయాన్నే శివాలయం పూజారి ఆలయం వద్దకు రాగానే విషయం గుర్తించి ఆలయ ధర్మకర్త కొంచాడ ధర్మారావుకు సమాచారం అందించారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్ రామారావుకు సమాచారం అందించారు. ఆలయం వద్దకు తన సిబ్బందితో చేరుకున్న ఎస్.రామారావు శ్రీకాకుళం, పలాసలోని క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. వారు హుటాహుటిన చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను పరిశీలించారు. ఆలయం పక్కనే రక్తపు మరకలు సైతం ఉండడంతో వాటి నమూనాలు సైతం సేకరించారు. పగలుగొట్టిన తాళాలు, హుండీ, తలుపులు, సీసీ కెమెరాలపై వేలిముద్రలను పరిశీలించారు. కానీ ఎలాంటి ఆధారాలు లభించలేదు. దొంగతనం చేసిన గ్యాంగ్ చాలా టెక్నికల్‌గా వ్యవహరించారని, ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ రరామరావులు స్పష్టం చేశారు. పూండి సమీప గ్రామాల్లో ఉన్న సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు. వేకువ జాము నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు, గ్రామ పెద్దలు ఆలయాల వద్దకు చేరుకుని పోలీసులతో సంప్రదింపులు చేశారు. శివాలయం ధర్మకర్త కొంచాడ ధర్మారావు, అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి టి.రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు.

జిల్లా కేంద్రంలో కార్డన్ సెర్చ్


ద్విచక్రవాహనం పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో రెండో పట్టణ పోలీసులు కేంద్ర పోలీసు దళాలతో కలిసి బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ హరికృష్ణ, కానిస్టేబుల్ వెంకటేష్, 23 మంది కేంద్ర పోలీసు దళాలు నగరంలోని గొంటివీధిలో చేసిన కార్డన్‌సెర్చ్‌లో భాగంగా 57 ఇళ్లను తనిఖీ చేశారు. ఇంటి యజమానులను కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను అడిగి వివరాలు తీసుకున్నారు. 42 వాహనాలను తనిఖీ చేసి వాటి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

కోటబొమ్మాళిలో..

కోటబొమ్మాళి: ఎన్నికల నేపథ్యంలో బుధవారం కోటబొమ్మాళి పంచాయతీ రెడ్డికవీధిలో ట్రైనీ డీఎస్పీ రాజారావు, స్థానిక ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 5 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు.

భారీగా గంజాయి స్వాధీనం


బరంపురం: స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు


జయపురం: గంజాయితో పట్టుబడిన కారు


పర్లాకిమిడి: పట్టుబడిన నిందితులు


పర్లాకిమిడి: స్వాధీనం చేసుకున్న వస్తువులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా పోలీసుస్టేషన్ పరిధి కమలాపూర్ నాకా గేటు వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక కారు, ట్రాక్టర్‌లో పోలీసులు తనిఖీలు చేయగా 197 కిలోల గంజాయి పట్టుబడింది. మోహనా సమితి చుడంగపూర్ గ్రామం నుంచి బరంపురం నగరానికి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఐఐసీ బసంత్ కుమార్ శెఠి తెలియజేశారు. గంజాయి రవాణా చేస్తున్న సుశాంత్ కుమార్ సాహు, ఆయన బావమరిది రామకృష్ణసాహు, ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు పర్సులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని తెలిపారు.

బరంపురం: కొందమాల్ జిల్లా ఫిరింగియా పోలీసులు 11 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన సంచలనం రేపింది. ఐఐసీ అధికారి గోపినాథ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. ఫిరింగియా పోలీసుస్టేషన్ పరిధి లొడడి గ్రామ సమీప ప్రాంతంలో రవాణాకి గంజాయి బస్తాలు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో దాడులు నిర్వహించి సుమారు 11 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి సుమారు రూ.50 లక్షలు విలువ చేస్తుందని తెలియజేశారు.

జయపురం: సదర్ పోలీసులు ఒక కారులో తరలిస్తున్న 148 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 1వ తేదీ రాత్రి విజయవాడ - రాంచీ 326 జాతీయ రహదారి పాత్రోపుట్ ప్రాంతంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సులోచన ప్రధాన్ నేతృత్వంలో పోలీసులు వాహన తనికీలు నిర్వహించారు. ఆయన సమయంలో జయపురం వస్తున్న ఒక కారులోని వ్యక్తులు పోలీసులను చూసి కారును వదిలి పరారయ్యారు. వారిని పోలీసులు వెంబడించినా పట్టుకోలేకపోయారు. అనంతరం కారుని తనికీ చేయగా 6 బ్యాగుల్లో 148 కిలోల గంజాయి పట్టుబడింది. దాని విలువ దాదాపు రూ.15 లక్షలు ఉంటుందని వెల్లడించారు. సంఘటనపై కేసు నమోదు చేసి కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించామని వెల్లడించారు.



భజ గోవింద అఖండనామ సంకీర్తన యజ్ఞం సందర్భంగా మండలంలోని కేదారిపురంలో బుధవారం నుంచి యాగం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక బాహుదానది నుంచి మహిళలు భక్తి శ్రద్ధలతో కలశాలలో జలాలను నింపి పురవీధుల్లో యాత్ర సాగించారు. రామచండీదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు యజ్ఞం, అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని వడ్డివీధికి చెందిన ఉల్లి వినయ్‌కుమార్(35) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సీతారాం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, వడ్డివీధికి చెందిన వినయ్‌కుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వివరాలు తెలిశాక వెల్లడిస్తామన్నారు.

మృతుని వివరాలు లభ్యం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామం వద్ద రేల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వర్రావు బుధవారం మాట్లాడుతూ మృతుడిని గజపతినగరం మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన గెద్ద తాతినాయుడు(37) గుర్తించినట్లు చెప్పారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రిలో మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

100 మద్యం సీసాల పట్టివేత



మద్యం సీసాలు, నిందితుడితో ఎస్సై జయంతి, సిబ్బంది

బాడంగి: మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన యామల శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 100మద్యం సీసాలను ఎస్సై ఆర్.జయంతి, సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. మల్లంపేట వైన్‌షాపులో సుమారు రూ.15వేల విలువైన మద్యం సీసాలను కొని ద్విచక్రవాహనంపై తన గ్రామానికి శ్రీనివాస రావు తరలిస్తుండగా సమీపంలోని మామిడితోట వద్దగల గ్రావెల్ రోడ్డుపై కాపు కాసి పట్టుకున్నట్లు ఎస్సై జయంతి ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కోడి పందాల రాయుళ్ల అరెస్టు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం శివారులో కోడి పందాలు ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా నిందితుల దగ్గర 5 కోడి పుంజులతో పాటు, రూ.920 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

9 మంది పేకాటరాయుళ్లు..

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పరిధిలో గల ఓ ప్రైవేట్ హోటల్‌లో పేకాట ఆడుతున్న వారిపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.లక్షా 8వేల 650, పది మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

బైక్, కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

గరుగుబిల్లి: మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్ పరిధిలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం, కారు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానిక ఎస్సై అమ్మాన్ రావు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖడ్గవలస జంక్షన్ నుంచి పార్వతీపురం వస్తున్న ద్విచక్రవాహనాన్ని పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్లా గాయాలపాలైన పార్వతీపురం పట్టణానికి చెందిన మర్రి దాలయ్య, ఎస్.ప్రదీప్‌లను జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. కారు నడిపిన ఎల్విన్‌పేటకు చెందిన నీలకంఠేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానవ జీవితానికి పునాది భగవద్గీత



భీష్మారావును సత్కరిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణ, తదితరులు

విజయనగరం టౌన్: మానవ జీవితానికి పునాది భగవద్గీతని విశాఖ నిష్కమ ఫౌండేషన్ ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట అనాసరపు వారి వీధిలో ఉన్న శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనం చివరిరోజు బుధవారం రాత్రి భగవద్గీతలోని పలు అంశాలను ప్రబోధించారు. భగవద్గీత మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న మహత్యముగా గుర్తించబడుతుందన్నారు. మానవ జీవితంలో పలు సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకులు ఎమ్.భీష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తిగీతాలు ఆద్యంతం అలరించాయి. అనంతరం నిర్వాహకులు ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎమ్.వంశీలక్ష్మి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సిరిమాను సంబరం



కొట్టాంలో సిరిమాను సంబరాన్ని చూసేందుకు బారులు తీరిన జనం

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో వెలసిన కోటమ్మ తల్లి అమ్మవారం సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. గ్రామంలో అమ్మవారి పండగను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గ్రామంలో ఏర్పాటు చేసిన సిరిమాను సంబరాన్ని చూసేందుకు వచ్చిన జనంతో ఊరంతా కిటకిటలాడింది. గ్రామంలో ఎటు చూసినా జన హోరు కనిపించింది. ముందుగా గ్రామంలో అమ్మవారి గద్దె ఇంటి దగ్గర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సిరిమానుకు ముందు మొలమాను సిద్ధం చేశారు. తర్వాత గ్రామంలోని మత్స్యకారులంతా రోలుతో కలిసి రోటి పచ్చడికి సిద్ధమయ్యారు. మత్స్యకారులంతా రోటిలో వేసినవి దంచుతూ సిరిమాను వద్దకు వెళ్లి పూజలు చేశారు.



సిరిమానును అధిరోహించిన పూజారి

తర్వాత సిరిమానుకు ప్రదక్షిణ చేసి, పూజారిని ఎక్కించారు. సాయంత్రం 6గంటల సమయంలో ఏర్పాటు చేసిన రథంపై పూజారిని అధిరోహింపచేశారు. సిరిమాను గ్రామంలోని ప్రధానవీధిలో కదులుతుండగా జనం బారులు తీరి సిరిమాను సంబరాన్ని వీక్షించారు. కోటమ్మ తల్లీ కాపాడమ్మా అంటూ నినాదాలు చేశారు. గ్రామస్తులంతా సంబరాల్లో మునిగి తేలడంతో ఊరంతా కోలాహలంగా మారింది.



సిరిమాను సంబరంలో పూజారితో కలిసి నడుస్తున్న యువత

నడిరోడ్డుపై కూటమి నేతల ప్రెస్‌మీట్

- భారీగా ట్రాఫిక్ జామ్
- తిరగబడ్డ ప్రయాణికులు

నెల్లిమర్ల రూరల్:

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో ఆ పార్టీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి బుధవారం నెల్లిమర్ల మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశం భారీగా ట్రాఫిక్ జామ్‌కు దారితీసింది. మీడియా సమావేశానికి కూటమిలో ఉన్న టీడీపీ, బీజేపీ నాయకులు హాజరు కాగా వాహనాలు రద్దీగా తిరుగుతున్న ప్రధాన రహదారి మధ్యలో ప్రెస్‌మీట్ పెట్టి వారు హంగామా సృష్టించడంతో రోడ్డు మధ్యలో సుమారు అరగంట పాటు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అసలే మండుటెండ కావడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రయాణికుల్లో కోపం కట్టలు తెంచుకోవడంతో కూటమి నాయకులపై తిరగబడ్డారు. భారీగా సౌండ్‌హార్న్ మోగించి నిరసన తెలియజేశారు. నడిరోడ్డు మీద ప్రెస్‌మీట్‌లు పెడతారా అంటూ తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. మండుటెండలో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తారా? బుర్రా, బుద్ధి లేదా అంటూ ఫైర్ అయ్యారు. మరికొంత మందైతే ఏకంగా బూతులతో విరుచుకుపడ్డారు. కూటమి నేతలు ఎదురుదాడికి ప్రయత్నించినప్పటికీ..ప్రయాణికుల ఆగ్రహం ముందు వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి దాపురించింది. రహదారి మధ్యలో మీడియా సమావేశం ఏర్పాటుకు పోలీసుల పర్మిషన్ ఎలా ఇచ్చారని ప్రయాణికులు ప్రశ్నించారు. ఈ సమస్యను స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.



రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం

సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తక ప్రదానం

పార్వతీపురం: డా.బీఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) మీడియా సంబంధాల విభాగం సమన్వకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.లీలాప్రసాదరావు 'సిక్కోలు రాజకీయ చరిత్ర' పుస్తకాన్ని రెడ్‌క్రాస్ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ డా. మంచిపల్లి శ్రీరాములుకు ప్రదానం చేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని మంచిపల్లి శ్రీరాములు స్వగృహానికి వచ్చిన ఆయన 1920–2020 సంఘటనల ఆధారంగా తాను రచించిన పుస్తకాన్ని మంచిపల్లి శ్రీరాములకు అందజేయగా లీలా ప్రసాదరావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మంచిపల్లికి పుస్తకాన్ని ప్రదానం చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.లీలాప్రసాదరావు

బైక్ వ్యాన్ ఢీ: గిరిజనుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సతీష్

సీతంపేట: మండలంలోని కె.గుమ్మడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కురుపాం మండలంలోని వడ్డంగి పంచాయతీ కాకిలి గ్రామానికి చెందిన గిరిజనుడు కద్రక సతీష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. వివాహశుభ కార్యానికి కీసరజోడు గ్రామానికి వెళ్లి ద్విచక్రవాహనంపై సతీష్ తిరిగివస్తుండగా బిల్లుమడ సెంటర్ వద్ద సీతంపేట నుంచి కొత్తూరు వెళ్తున్న మహీంద్ర పికప్ వ్యాన్ బలంగా ఢీకొట్టి రహదారి పక్కన ఉన్న చెట్టు వరకు దూసుకుపోయింది. దీంతో సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో వ్యాన్‌డ్రైవర్ రామకృష్ణకు గాయాలయ్యాయి. మృతుడికి తల్లిదండ్రులు చిన్నాలమ్మ, చుంచులు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు హఠాన్మరణంతో కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

విజయనగరం క్రైమ్: స్థానిక జమ్ము గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వెనుక భాగంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు స్థానికులు గుర్తించి, రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు పోలీసులు వచ్చి పరిశీలించి వృద్ధుడికి సుమారు 65 ఏళ్ల వయస్సు ఉంటుందని, నీలం రంగు నిక్కర్, నలుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. చనిపోయి రెండు, మూడురోజులై ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఎవరైనా గుర్తిస్తే రూరల్ ఎస్సై ఫోన్ 9121109441 నంబర్‌కు సమాచారమందించాలని కోరారు.



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో శ్రీఆంజనేయస్వామి తీర్థమహోత్సవం బుధవారం ప్రారంభమైంది. గ్రామ పురోహితుడు బొడ్డపాటి హరిశర్మ మంత్రోచ్చారణతో స్వామివారికి అష్టోత్తర శత నామాలతో పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన



ప్రదర్శనలో పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామంలో ఇంటమ్మతల్లి అమ్మవారి పండగ సందర్భంగా శెట్టిబలిజ యూత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వాటిలో వల్లంపూడికి చెందిన శానాపతి నాయుడు ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచి రూ.15 వేలు కైవసం చేసుకున్నాయి. తర్వాత స్థానాల్లో నిలిచిన ఎడ్లకు రూ. 12,10, 8 వేలు చొప్పున నగదు బహుమతులను ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. గురువారం అమ్మవారి పండగ వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఆర్డీఓ హేమలత అన్నారు. పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టార్ అధికారులకు అప్పగించిన పది పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో గల పీఓల సమన్వ యంతో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమలుపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీల నిర్వహణ పటిష్టం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

వెంకటరాజపురంలో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, బట్లబద్ర, బిత్రపాడు, గవరమ్మపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. పామాయిల్, అరటి, వరి పొలాల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి సమయాన వెంకటరాజపురం పరిసర ప్రాంతాల్లోని పామాయిల్ తోటలో తిష్టవేయడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. వీలున్నంత వరకు రాత్రి సమయాన పంటపొలాలకు వెళ్లవద్దని కోరారు.



వెంకటరాజపురం పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

భక్తిభావంతో ప్రశాంత జీవనం

గంట్యాడ: భక్తి భావంతో ప్రశాంత జీవనం సొంతమవుతుందని పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్రసరస్వతి స్వామి అన్నారు. గంట్యాడ మండలంలోని గిరిశిఖర గ్రామమైన ఎగువ కొండపర్తి గ్రామంలో సముద్ర మట్టానికి 3,333 అడుగల ఎత్తులో నూతనంగా నిర్మించిన వైకుంఠగిరి అనంత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠను స్వరూపనందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండకోనల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారి ఆలయం నిర్మించడం ఆనంద దాయకమన్నారు. ఇక్కడి వాతావరణం 3,200 అడుగల ఎత్తులో ఏడుకొండలపై వెలిసిన తిరుపతి వేంకటేశ్వరుని ఆలయాన్ని పోలి ఉందన్నారు. గిరిపుత్రులు నిత్యం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే భాగ్యం కలిగిందన్నారు.

పూజల్లో ఆలయ ధర్మకర్త సముద్రారెడ్డి దంపతులు..

విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచే నిర్వహించిన పూజలు, యాగాల్లో ఆలయ ధర్మకర్త కర్రి సముద్రారెడ్డి, శ్రీవిద్య దంపతులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, పారాయణ జరిపారు. ఉదయం 8 గంటలకు శ్రీ విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర కలశ స్నపనం, అభిషేకం, ప్రధాన కలశత్రయ మండలారాధన, హోమాలు జరిపారు. ఉదయం 9:14 నిమిషాలకు స్వామివారి విగ్రహప్రాణ ప్రతిష్ఠ జరిపారు. శ్రీపద్మావతి, శ్రీ గోదాదేవి (శ్రీ అండాల్) పన్నిద్రాళ్వార్, గరుడ, ధ్వజస్తంభ, బలిపీఠ వరాహ స్వామి, సంకల్ప, సిద్ధి శ్రీ మహాగణపతి స్వామి వార్ల యంత్ర స్థాపనలు, శిఖర, చక్రస్థాపన, విగ్రహ స్థాపనలు నిర్వహించారు.




విగ్రహ ప్రతిష్ఠ కోసం పూజలు చేస్తున్న స్వరూపనందేంద్ర సరస్వతిస్వామి, శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి



అనంత వేంకటేశ్వర స్వామి ఆలయం

ఘనంగా వేమాలమ్మ అమ్మవారి ప్రతిష్ట

వేపాడ: మండలంలోని బానాది పంచాయతీ ఎం.శింగవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేమాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలతో ఆలయ శిఖరం ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు, అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.



ఎం.శింగవరంలో ప్రతిష్ఠించిన వేమాలమ్మ విగ్రహం

5న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో సంతోషిమాత ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన భారీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఈనెల5న ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విగ్రహప్రతిష్ఠ అనంతరం భారీ అన్న సమారాధన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ

విజయనగరం టౌన్: స్థానిక మంగళవీధిలో కొలువైన శ్రీ నూకాలమ్మ అమ్మవారు బుధవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని వేకువజాము నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశిష్ట అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. రాత్రి 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో చీపురుపల్లికి చెందిన శ్రీ సరస్వతి కళా బృందం డీవీవీ జగన్నాథరావు పంతులు ట్రూప్‌చే నిర్వహించిన శ్రీ సత్యభామా కలాపం భాగవతం ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న నూకాలమ్మ అమ్మవారు

ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ వెలుగులు

- ఉచితంగా విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం
- ఐదేళ్లలో లబ్ధిపొందిన ఎస్సీలు 2,60,165 మంది
- ఎస్టీలు 1,91,745 మంది

విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పూజారి రాములమ్మ. ఈమెది కొండపర్తి గ్రామం. నిరుపేద కుటుంబం. 2019 నుంచి ఇప్పటి వరకు ఈమెకు ప్రభుత్వం విద్యుత్ రాయితీ ఇస్తోంది. నెలకు 50 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఈ కుటుంబం వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ఏడాదికి రూ.2 వేల నుంచి రూ.2100 వరకు ప్రభుత్వం ఆమె వినియోగించిన ఉచిత విద్యుత్‌కు వెచ్చిస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పొరపు అప్పలకొండ. బాడవ గ్రామం. ఈమె నెలకు 50 నుంచి 80 వరకు యూనిట్లు విద్యుత్ వినియోగిస్తోంది. ఐదేళ్లుగా ఆమె వినియోగించిన విద్యుత్‌కు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తోంది.



ఇలా వీరిద్దరికే కాదు. అనేక మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోంది. దీని వల్ల వారికి ఎంతగానో ఊరట కలుగుతోంది. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. పథకాలన్నీ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేవే. అవినీతి, సిఫార్సులకు తావు లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించింది. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసి వారిళ్లలో విద్యుత్ వెలుగులు నింపింది.



గంట్యాడ మండలంలోని పెదవేమలిలో ఎస్సీ లబ్ధిదారుని ఇంట్లో వెలుగుతున్న ఎల్ఈడీ బల్బు

200 లోపు యూనిట్లు వినియోగించిన వారికి ఉచితం

నెలలో 200 లోపు యూనిట్ల విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోంది. జిల్లాలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలే. వారంతా ఈ పథకం లబ్ధి పొందుతున్నారు. ఉచితంగా విద్యుత్ అందించడం వల్ల ఆయా వర్గాలు ఎంతోగానో ఆనందపడుతున్నాయి. గతంలో కొంతమందికి విద్యుత్ సౌకర్యం ఉండేదికాదు. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మీటర్ పెట్టుకునేవారు కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా ఇస్తుండడంతో విద్యుత్ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటున్నారు.

ఐదేళ్లలో 2,60,165 ఎస్సీలకు లబ్ధి

గడిచిన ఐదేళ్ల కాలంలో 2019 నుంచి ఇప్పటివరకు ఎస్సీలు 2,60,165 మందికి ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరింది. ఐదేళ్లలో వారంతా 20,47,81,765 యూనిట్ల విద్యుత్ వినియోగించారు. అదేవిధంగా ఎస్టీలకు సంబంధించి 2019 నుంచి ఇప్పటి వరకు 1,91,745 మంది లబ్ధిదారులు పొందారు. ఐదేళ్ల కాలంలో వారంతా 10, 19,77441 యూనిట్ల విద్యుత్ వినియోగించారు.

రూ. 4 వేల నుంచి రూ.5 వేల వరకు లబ్ధి

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ వల్ల ఒక్కో లబ్ధి దారుకు ఏడాదికి రూ. 4 వేల నుంచి రూ.5 వేల వరకు లబ్ధిచేకూరుతోంది. ఐదేళ్లలో ఎస్సీలకు ఉచిత్ విద్యుత్‌కు రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్లు వరకు ప్రభుత్వం వెచ్చించింది. అదే విధంగా ఎస్టీలకు రూ.76 కోట్ల నుంచి రూ. 90 కోట్లు వరకు వెచ్చించింది.